**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**

**ANDHRA PRADESH COMMITTEE**

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com

విజయవాడ,
తేది : 03 ఆగస్టు, 2020.

**శ్రీయుత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గారికి,**
గౌరవ ముఖ్యమంత్రి,
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము,
వెలగపూడి.

**ప్రచురణార్థం:** సిపిఐ(యం) రాష్ట్ర కార్యదర్శి పెనుమల్లి మధు ముఖ్యమంత్రికి వ్రాసిన లేఖను ప్రచురణార్థం పంపుతున్నాం. **– జె.ప్రభాకర్,** ఆఫీస్ కార్యదర్శి

**విషయం : కరోనా పెరుగుతున్న నేపథ్యంలో తక్షణ చర్యల నిమిత్తం...**

**ఆర్యా!**

రాష్ట్రంలో కరోనా విలయ తాండవం చేస్తోంది. ఒక్క జులై నెలలోనే 885 శాతం పెరుగుదలతో కొత్తగా 1,26,337 నిర్ధారిత కేసులు నమోదయ్యాయి. రాష్ట్రంలో అత్యధిక జనసాంద్రత గల తూర్పు గోదావరి జిల్లాలో నైతే కేసులు పెరుగుదల 1800 శాతంగా వుంది. మన రికవరిరేటు కేవలం 45.3 శాతం కాగా జులై నెలలో పాజిటివ్ రేటు 11.9 శాతం గానూ, మొత్తం మీద పాజిటివ్ రేటు 7.227 గాను వుంది. గత మూడు రోజుల్లోనే 30636 కేసులు పెరిగి దేశంలోనే ఆంధ్రప్రదేశ్ కరోనా పెరుగుదల తీవ్రతలో ముందుంది. ఆగస్టు నెల మరింత తీవ్రంగా వుండబోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

**(1)** అన్నిరకాల బెడ్లు అందుబాటులో వున్నట్టు చెపుతున్నప్పటికి జిల్లాల్లో పరిస్థితి భిన్నంగా కన్పిస్తున్నది. బెడ్లకోసం సిఫార్సులు చేయించుకొన్నా బెడ్లు దొరకని పరిస్థితి ఉన్నది. ప్రైవేటు ఆసుపత్రులు, ఇంజనీరింగు కళాశాలలు, ఫంక్షన్ హాళ్ళు స్వాధీనం చేసుకొని బెడ్లను వెంటనే అందుబాటులోకి తీసుకొని రావాలి. మీరు ఆదేశించినట్టు అవసరమైన ప్రతి ఒక్కరికి అరగంటలో ఆసుపత్రిలో బెడ్డు ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలి.

**(2)** రోగలక్షణాలు లేవనీ, ఉన్నా తీవ్రస్థాయిలో లేవనీ ఎక్కువ మందిని హోమ్ ఐసోలేషన్‌లోనే బలవంతంగా వుంచుతున్నారు. ఇళ్ళలో తగిన వసతులు స్తోమత లేని పేదలు దీనివల్ల భయం భయంగా బ్రతుకుతున్నారు. వీరివల్ల ఇతరులకు కరోనా సంక్రమించే అవకాశం ఉంది. కాబట్టి కోరుకున్న వారినందరిని క్వారంటైన్ కేంద్రం లేదా ఆసుపత్రులలో చేర్చాలి. క్వారంటైన్ కేంద్రాల సంఖ్యను ప్రతి నియోజకవర్గంలో పెంచాలి.

**(3)** హోమ్ ఐసోలేషన్ వారికి వైద్యుల అందుబాటు, సలహాలు, పర్యవేక్షణ అవసరం. దాదాపు వీరిని ఇటీవల పట్టించుకొనేవారుండటం లేదు. ప్రతి రోగి ఒకవైద్యుడు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో వుండితీరాలి.

**(4)** వైద్యులు, సిబ్బంది లేక పోవడం పెద్ద సమస్య. ప్రస్తుతం పనిచేస్తున్న వారిపై భారం, ఒత్తిడి పెరిగి పోతున్నాయి. వైద్యుల, నర్సుల రిక్రూట్‌మెంటుకు మీరు ఇప్పటికే ఆదేశించారు. రిక్రూట్‌మెంటును యుద్ధప్రాతిపదికన వేగంగా జరిగేటట్లు చర్యలు తీసుకోవాలి. వారి గౌరవ వేతనాన్ని భారీగా పెంచాలి.

**“త్రిప్పి చూడగలరు”**

(5) వైద్య సేవల్లో ప్రత్యక్షంగా వున్నవారికి మాత్రమేగాక పరోక్ష డ్యూటీల్లో వున్నవారికి సైతం భీమా సౌకర్యం కల్గించాలి. దీనికోసం రాష్ట్రం ఒక పథకం ప్రవేశపెట్టాలి.

(6) ప్రైవేటు ఆసుపత్రుల్లో కరోనా సేవలు అందిస్తున్నవారికి పి.పి.యిలు, మాస్కులు తదితరాల్ని ప్రభుత్వం తక్కువరేట్లతో సరఫరా చెయ్యాలి. ప్రైవేటు వైద్యులు కరోనా వైద్యం చేసేలా ప్రభుత్వం ప్రోత్సాహం, సపోర్టు ఇవ్వాలి.

(7) హోమ్ ఐసొలేషన్‌లో ఉంటున్న పేదలకు పౌష్టికాహారం తీసుకునేందుకు వీలుగా తగిన ఆర్థిక సహాయం ప్రభుత్వం చేయాలి.

(8) సంఖ్యాపరంగా చూస్తే పరీక్షల్లో ఆంధ్రప్రదేశ్ అగ్ర స్థానంలో వుంది. ఇది ఆహ్వానించదగ్గది. కానీ పరిక్షాఫలితాలు రోజుల తరబడి తెలియడం లేదు. పరీక్షలకు సిఫార్సులు కావాల్సి వస్తోందని జిల్లాల్లో చెపుతున్నారు. కోరుకొన్న వారందరూ పరీక్షలు చేయించుకొనగలిగేలా, కనీసం 24 గంటల్లో ఫలితాలు వెలువడేలా చర్యలు తీసుకోవాలి.

(9) జిల్లాస్థాయిలో నిత్యం పరిస్థితిని సమీక్షంచే ఏర్పాటు వుండాలి. పార్టీలతో, ప్రజా ప్రతినిధులతో జిల్లా కలెక్టరు నిర్దిష్ట సమయానికి ఒకసారి సమీక్ష జరపాలి. సలహాలు తీసుకోవాలి. వైద్య సేవలు పారదర్శకంగా వుండాలి.

(10) ఐసొలేషన్, క్వారెంటైన్ కేంద్రాల్లోనే గాక ఇళ్ళలో వున్న రోగులకు కూడా అన్ని రకాల సహాయం అందించేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చే సంస్థల్ని, కార్యకర్తలను వినియోగించు కోవాలి.

పై సూచనలను పరిగణలోనికి తీసుకుని తగు చర్యలు తీసుకోగలరని ఆశిస్తున్నాము.

అభివందనములతో...

**(పెనుమల్లి మధు)**
రాష్ట్ర కార్యదర్శి